## క్లుప్తంగా

### రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

**గూడెంకొత్తవీధి:** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుల ద్వారా అనేక భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని గూడెంకొత్తవీధి తహసీల్దారు రామకృష్ణ అన్నారు. ఆయన రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని 135 రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 6 నుంచి జనవరి 8 వరకూ సదస్సులు జరగనున్నట్టు చెప్పారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై సిబ్బందికి సూచనల చేశారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు దుమంతి సత్యనారాయణ, ఆర్ఐ మహదేవ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

### నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలి



సంకాడలో ఆర్‌బీకేను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తదితరులు

**గూడెంకొత్తవీధి:** ప్రభుత్వ భవనాలను సత్వరమే పూర్తిచేయాలని ఎంపీడీవో ఉమాహేశ్వరరావు అన్నారు. మండలంలోని పలు పంచాయతీల్లో ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లను ఆయన బుధవారం సందర్శించారు. సంకాడలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. అసంపూర్తి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మండల ఇంజినీరింగ్ అధికారి జ్యోతిబాబు తదితరులున్నారు.

### గ్రామాల్లో సర్వేల నిర్వహణపై సూచనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

**చింతపల్లి:** ప్రభుత్వం తలపెట్టిన హౌస్‌హోల్డ్ సర్వేతో పాటు ఎన్‌పీసీఐ నమోదును వేగవంతం చేయాలని చింతపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. పంచాయతీ కార్యదర్శులతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. కలెక్టర్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సత్వరమే ఈ సర్వేలను పూర్తిచేయాలని కోరారు.

### వాహనాల తనిఖీలు



డొంకరాయిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

**మోతుగూడెం:** మావోల వారోత్సవాల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పర్యవేక్షణలో సివిల్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు బుధవారం వాహనాల రికార్డులు పరిశీలించారు. వాహనాల్లో లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పి.వెంకట్

**చింతూరు:** కల్లేరులో బుధవారం సీపీఎం మహాసభ జరిగింది. మండల పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎనుకున్నారు. మండల కార్యదర్శిగా పల్లపు వెంకట్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ తరపున కృషి చేస్తామన్నారు. కమిటీ సభ్యులుగా శ్రీనివాస్, రంగమ్మ, రాజ్‌కుమార్, కన్నయ్య, చిన్నయ్య, రమేష్, రాంబాబు, నగేష్, సుబ్బారావులు ఎన్నికయ్యారు.



- గ్రామాల్లో కానరాని మౌలిక సదుపాయాలు
- కాలినడకే శరణ్యం
- ఆదివాసీల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

# అభివృద్ధి ఊసేది.. రహదారుల జాడేది?



అభివృద్ధికి నోచుకోని జర్రెలపోదర్ గ్రామం



జర్రెలపోదర్ గ్రామం రహదారి

స్వతంత్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఆ గ్రామాలకు నేటికీ సరైన రహదారి లేదు...నిత్యం కాలినడకనే ప్రయాణం ... అత్యవసర పరిస్థితుల్లో అందని 108, 104 సేవలు... డోలీమోతలే దిక్కు.... అడవి మార్గంలో పయనం.. కొండలు, గుట్టలు..పెద్ద పెద్ద గోతులు..రాళ్లు తేలిన దారులు.. చినుకు పడితే చిత్తడిమయం.. రవాణా సదుపాయం ఊసే లేదు..అభివృద్ధికి దూరంగా సమస్యలతోనే ఆదివాసీల సహవాసం.. పట్టించుకోని కూటమి ప్రభుత్వం.. ఇది రంగబయలు పంచాయతీ గ్రామాల్లో ఆదివాసీల దయనీయ దుస్థితి.

**ముంచంగిపుట్టు:** మండలంలోని రంగబయలు పంచాయతీ అత్యంత మారుమూల జర్రెలపోదర్, బుడ్డపనస, డెంగ్‌సిమ్లి, డెంగం, గోబ్బరపడ, దుమడగూడ గ్రామాలు అభివృద్ధికి చాలా దూరంలో ఉన్నాయి. ఆయా గ్రామాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఆయా ఆరు గ్రామాల్లో 184 కుటుంబాలకు చెందిన 642 మంది పివీటీసీ గిరిజనులు నివసిస్తున్నారు.

గ్రామాలకు సరైన రహదారి లేకపోవడంతో రవాణా సదుపాయం కరువై నానా కష్టాలు పడుతున్నారు.

### కానరాని కనీస సౌకర్యాలు



జర్రెలపోదర్‌లో శిథిలమైన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

ఆయా ఆరు గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవు. తాగునీటి సమస్య వేధిస్తోంది. ఎండాకాలంలో ఊటగెడ్డలే శరణ్యం... వర్షాకాలంలో కలుషిత నీటి వినియోగంతో ఆయా గ్రామస్తులు రోగాలతో సతమతమవుతున్నారు.. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు వీధుల్లో నిల్వ ఉండిపోతోంది. పారిశుధ్యం లోపించి దోమలు స్వైర విహారం చేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలకు పక్కా భవనం లేక చెట్ల నీడలో..ఇంటి వరండాల్లో విద్యార్థుల చదువులు సాగుతున్నాయి. కొన్ని పాఠశాలలకు భవనాలు ఉన్నా అవి పూర్తిగా శిథిలమైపోయాయి.

### అడవి మార్గం.. సాహస ప్రయాణం

ఆయా గ్రామాల నుంచి రంగబయలు పంచాయతీ కేంద్రానికి రావాలంటే 5 కిలో మీటర్లు కాలినడకన కొండలు, గుట్టలు ఎక్కి అటవీ మార్గం మీదుగా సాహసమైన ప్రయాణం చేయాల్సిందే. వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించే వాగులు దాటితేనే పంచాయతీకి చేరుకోగలరు. రేషన్ సరకుల కోసం చంపాపుట్టు గ్రామానికి కాలినడకన నాలుగు కిలోమీటర్లు వచ్చి సరకులను మోసుకొని గ్రామాలకు వెళ్లాల్సిన దయనీయ దుస్థితి. అత్యవసర సమయాల్లో రోగు లను, గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే డోలిమోతే దిక్కు. ముఖ్యంగా అడవీ మార్గంలో అతికష్టం మీద భయం భయంగా ప్రయాణిస్తేనే ఆరోగ్య కేంద్రాలకు తరలించడం పరిపాటిగా మారింది.

### శ్రమదానంతో తాత్కాలిక రహదారి



పంచాయతీలో జర్రెలపోదర్, బుడ్డపనస, డెంగ్‌సిమ్లి, డెంగం, గోబ్బరపడ, దుమడగూడ గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. దీంతో జర్రెలపోదర్ నుంచి నూవగూడ వరకు ఆరు గ్రామాల గిరిజనులు శ్రమదానంతో తాత్కాలిక రహదారిని నిర్మించుకున్నారు. అటవీ, కొండ మార్గాలలో మట్టిని తవ్వి, చదును చేసి, పెద్ద పెద్ద బండరాళ్లను తొలగించారు. రోజుకు 100 మంది చొప్పున శ్రమదానం చేయడం కొంతమేర రహదారి పూర్తి చేశారు. ప్రస్తుతం కాలినడక, అతికష్టం మీద ద్విచక్రవాహనాలకు తీసుకొని వెళ్లేందుకు రహదారి వినియోగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా బరడ పంచాయతీ కోదంజోలా గ్రామం నుంచి జర్రెలపోదర్‌కు మట్టి రోడ్డుకు నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయి. అయితే అటవీ శాఖాధికారులు అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలుపుదల చేశారు. దీంతో పాటు ఫారెస్టు, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సమన్వయం లోపం, ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో రహదారి నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి తమ గ్రామాలకు రహదారులతో పాటు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఇప్పటికైనా మన్యప్రాంతాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో గిరిజనులు వేచి చూస్తున్నారు.

### సమస్యలు తీర్చాలి



సరైన రహదారి లేక అటవీ, కొండల మార్గంలోనే ప్రయాణిస్తున్నాం. రేషన్ సరకులు తెచ్చుకునేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్ష కాలం నాలుగు నెలలు గ్రామం నుంచి బయటకు వచ్చేందుకు సాహస ప్రయాణాలు చేయాల్సి వస్తోంది. పాఠశాలకు భవనం లేదు. మా పిల్లలు చదువుల పరిస్థితి ఏమిటి. ప్రభుత్వం ,అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

–కళ్యాణం, జర్రెలపోదర్ గ్రామం, రంగబయలు పంచాయతీ

### రహదారి నిర్మించండి



గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక దుర్భరంగా గడుపుతున్నాం. రహదారులు లేక రోగులు, గర్భిణులకు డోలీమోతలే గతి. సకాలంలో వైద్యం అందక మృతి చెందిన సందర్భాలున్నాయి. రహదారికి నిధులు మంజూరైనా ఫారెస్టు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు పలు కారణాలతో రహదారి ముందుకు సాగలేదు. రహదారి సమస్య తీరితేనే ఆరు గ్రామాల గిరిజనుల బతుకులు బాగుపడతాయి. – ఎస్.భాగ్యవతి, వైస్ ఎంపీపీ, ముంచంగిపుట్టు మండలం

### అనుమతుల కోసం ప్రతిపాదించాం

అత్తికలు గ్రామం నుంచి జర్రెలపోదర్‌కు గ్రావెల్ రోడ్డు మంజూరై పనులు మొదలు పెట్టడం జరిగింది. ఫారెస్టు శాఖ నుంచి కొన్ని అడ్డంకులు వల్ల నిలుపుదల చేయడం జరిగింది. మరలా ఫారెస్టు శాఖకు అనుమతుల కోసం కొరడం జరిగింది. అనుమతులు వచ్చిన వెంటనే గ్రావేల్ రోడ్డు వేగంగా పూర్తి చేసి గ్రామానికి రహదారి సమస్య తీరుస్తాం.

– రాముము, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ, ముంచంగిపుట్టు

### 'చలో విజయవాడ'ను విజయవంతం చేయండి



జి.మాడుగులలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

**జి.మాడుగుల:** దేవాలయాల పరిరక్షణ నేపథ్యంలో విశ్వహిందూ పరిషత్ హైందవ శంఖారావంలో భాగంగా జనవరి 5న నిర్వహించనున్న చలో విజయవాడ బహిరంగ సభను విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జి.మాడుగుల మండల కేంద్రంలో బుధవారం దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించేలా దేవాలయాల నిర్వహణలో చేయాల్సిన సంస్కరణలు తీసుకురావాలని కోరుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మత్స్యారాస మత్స్యారాజు, నాయకులు కొండబాబు, సాములు, విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ అప్పలరాజు, కన్వీనర్ నీలకంఠం, రఘురామాచారి, భాస్కరరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో ఎంఈవో తనిఖీలు



గంగవరం పాఠశాలలో తనిఖీలు చేస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

**గంగవరం :** మండలంలోని పలు పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి–2 టి.మల్లేశ్వరరావు బుధవారం సందర్శించి తనిఖీలు నిర్వహించారు. మండల కేంద్రంలోని వివిధ ప్రాథమిక పాఠశాల్లో జరుగుతున్న ఎస్‌ఏఎస్ పరీక్షలను ఎంఈఓ–2 మల్లేశ్వరరావు పరిశీలించారు. స్థానిక లూథరన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను, స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి తనిఖీలు చేసి ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. సీఆర్పీ శివ, ఉపాధ్యాయులున్నారు.

## హిందువులపై దాడులు ఆపాలని ధర్నా



ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న హిందు ఐక్యవేదిక నాయకులు

**పాడేరు :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు వెంటనే అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రమైన పాడేరులో హిందు ఐక్య వేదిక ప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సాయిబాబా గుడి నుండి మెయిన్ బజార్, పాత బస్టాండ్, సినిమాహాల్ సెంటర్, ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఐటీడీఏ ఎదుట కొద్దిసేపు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడకు వినతిపత్రాన్ని అందజేశారు. లేఖను రాష్ట్రపతికి అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. హిందు ఐక్య వేదిక కన్వీనర్ గోపాలపాత్రుడు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఆ దేశంలో ఉన్న హిందువులు. క్రైస్తవులపై అల్లరిమూకల దాడులు రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు నిరసన ర్యాలీ చేపట్టామన్నారు. ఉమామహేశ్వరరావు, రాజారావు, రామకృష్ణ, శాంతికుమారి, రాఘువేంద్ర, మత్స్యకొండబాబు, ఆనంద్, సూర్య, యోగి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి



ఎంపీడీవో చిన్నిబాబు

**అడ్డతీగల:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు నేరుగా బ్యాంకు ఖాతా ద్వారా పొందాలంటే ఎన్‌పీసీఐ అనుసంధానం తప్పనిసరి అని అడ్డతీగల ఎంపీడీవో చిన్నిబాబు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాకు ఆధార్ ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు. ఎన్‌పీసీఐ లింక్ పూర్తి కాని వారి వివరాలను గ్రామ సచివాలయాలు, పోస్టాఫీసుల వద్ద జాబితా ఉంచామన్నారు. అందువల్ల బ్యాంక్ వద్దకు వెళ్లి ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలన్నారు. బ్యాంకు ఖాతా లేనివారు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోని వాళ్లు పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించుకుని ఎన్‌పీసీఐ లింక్ పూర్తి చేసుకోవాలన్నారు. పోస్టాఫీసులో ఖాతా ప్రారంభించడానికి ఆధార్ కార్డు జిరాక్స్, మొబైల్ నెంబర్, రూ.200 నగదు చెల్లించాలన్నారు.

## పేరెంట్స్–టీచర్స్ సమావేశం ఏర్పాట్లపై సమీక్ష



పాఠశాలలో పేరెంట్, టీచర్ సమావేశం ఏర్పాట్లపై సమీక్ష జరుగుతున్న దృశ్యం

**రాజవొమ్మంగి:** మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 7న మెగా పేరెంట్స్– టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కూడా స్వచ్ఛందంగా కొంత మొత్తం సమకూర్చుకొంటున్నారు. పిల్లల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ఇప్పటికే ఈ మేరకు ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సమావేశానికి హాజరయ్యే అతిథులకు సత్కారం గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బహుమతుల ప్రదానం, భోజన ఏర్పాట్లు తదితర అంశాలను ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. సభావేదికను ప్రత్యేకంగా అలంకరించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు ఆయా పాఠశాలల్లో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించుకొన్నారు.

## సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు



చింతపల్లిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్



ఎటపాకలో రైతులతో ఏవో రాబిన్ సుదర్శన్

**ఎటపాక:** పంటల సాగులో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలతో పాటు మెలుకువలు తెలుసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ చెప్పారు. మండలంలోని చంద్రంపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు . ఈ సందర్భంగా ఏవో రాబిన్ సుదర్శన్ మాట్లాడుతూ సాగులో మెలకువలు పాటిస్తే లాభాలు పొందవచ్చన్నారు. రైతులకు సాగులో మెలకువలు, పురుగుల మందు పిచికారీ చేయాల్సిన సమయం, జాగ్రత్తలను వివరించారు. మిత్ర పురుగులు అంటే ఏమిటి ఏవిదంగా సహాయ పడతాయి. రైతులు వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, ఈ మేరకు క్వింటాకు రూ.2,300 ధర ఉన్నట్టు తెలిపారు.

**చింతపల్లి:** రాజ్‌మా రైతులకు బీమా సదుపాయం ద్వారా ఊరట కలుగుతుందని చింతపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బెన్నవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పంటలన పరిశీలించారు. రైతులకు పలు సూచనలిచ్చారు. తుపాను అనంతరం రైతులు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.రాజ్‌మా పంటకు రైతులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొత్తాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ సావిత్రి తదితరులు

**గంగవరం:** మండలంలోని కొత్తాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడ్డతీగల ఏడీఏ కె.సావిత్రి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కనీస మద్దతు ధరను క్వింటాకు రూ.2,300, ఎ–గ్రేడ్ రకం రూ.2,320ను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. నాణ్యత ప్రమాణాలు, తేమశాతం వంటి అంశాలను క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో కొత్తాడ, బయ్యనపల్లి, జడేరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు.ఏవో విశ్వనాథ్, మొల్లేరు సొసైటీ సీఈవో జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## గిరి గ్రామాల్లో సేవా కార్యక్రమాలు




మాట్లాడుతున్న ట్రస్టు చైర్మన్ బాలంపడాల్

**చింతపల్లి:** రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాలోని గిరిజన ప్రాంతాల్లోనూ ఆదివాసీ ట్రస్టు ద్వారా అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు అమలుచేస్తున్నట్టు ఆదివాసీ ట్రస్టు చైర్మన్ కోరాబు బాలంపడాల్ తెలిపారు. అంతర్లలో గ్రామంలో ఆదివాసీ ట్రస్టు ప్రధాన కార్యాయంలో బుధవారం ట్రస్టు సభ్యుల సమావేశంలో మాట్లాడారు. మూడేళ్లగా తమ సంస్థ పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశాలోని తమ ట్రస్టులో సుమారు 2.20లక్షల మంది ట్రస్టు సభ్యులుగా ఉన్నారన్నారు. ట్రస్టు సభ్యులు, వారి కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా అత్యవసర వైద్యం, శస్త్రచికిత్సలు వంటివి అవసరమైతే వాటి ఖర్చును భరించి ట్రస్టు ద్వారా మెరుగైన వైద్యసేవలందిస్తున్నామన్నారు. ఇటీవల అంతర్ల గ్రామానికి చెందిన కవడం కృష్ణ అనే గిరిజన యువకుడు ప్రమాదవశాత్తూ విద్యుత్తు స్తంభంపై నుంచి పడి తీవ్రంగా గాయపడితే అతనికి మెరుగైన వైద్యం కోసం అవసరమైన వైద్య ఖర్చులు రూ.50వేలు సాయం చేశామన్నారు. గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, సామాజిక భవనాలు వంటి మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సేవాభావంతో ట్రస్టు ద్వారా సేవలందిస్తున్న తరుణంలో కొందరు సామాజిక మాధ్యమాల్లో తమ ట్రస్టు సేవలను తప్పుపడుతూ దుష్ప్రచారం చేయడం తగదన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు పడాల్ తెలిపారు. ట్రస్టు ఉపాధ్యక్షుడు వండలం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు

**చింతపల్లి:** విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సైబర్ నేరాలు, గిరిజన హక్కులు, చట్టాలు, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాను విజ్ఞాన్ని పెంపొందించుకోవడానికి వినియోగించుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను వివరించారు. బ్యాంకు లావాదేవీలు వంటివి ఏ విధమైన వెబ్ లింక్‌ల ద్వారా చేయవద్దని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు ఖాతా నెంబర్, ఏటీఎం పిన్ వంటికి బహిర్గతం చేయవదని, రుణ ఆప్‌లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పాడేరు రూరల్(అరకులోయ రూరల్):** జిల్లాలోని పలు చోట్ల సబ్‌స్టేషన్‌ల మరమ్మతు పనుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పాడేరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అప్పారావు చెప్పారు. ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జిల్లాలోని డుంబ్రిగుడ, చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, కొయ్యూరు, అనంతగిరి మండలాల్లోని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని మరమ్మతు పనుల నేపథ్యంలో పలు గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉద్యాన పంటల సాగుకు రాయితీలు

**పాడేరు రూరల్(అరకు రూరల్):** ఉద్యాన పంటల సాగుకు రాయితీల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్‌కుమార్‌రావు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. పండ్లతోటల అభివృద్ధి విస్తరణకు హెక్టార్‌కు మామిడి పంటకు–రూ.7.980, జీడిమామిడికి–రూ.12,000, డ్రాగన్ ఫ్రూట్‌కు– రూ.30,000, అవకాడోకు రూ.18,000, స్ట్రాబేరికి–రూ.50,000 గరిష్ట రాయితీని ఉద్యానవన శాఖ ద్వారా మంజూరు చేస్తామన్నారు. హైబ్రిడ్ రకం కూరగాయల సాగుకు రూ.2000, పర్మినెంట్ పందిర్ల ఏర్పాటుకు హెక్టార్‌కు రూ.2,50,000 రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించారు. సమగ్ర నీటి యాజమాన్య పథకము కింద వాటర్‌పాండ్ల కోసం గరిష్టంగా రూ.15,000 రాయితీ ఇస్తామన్నారు. మినీ ట్రాక్టర్ కోసం రూ.75,000లు, పవర్ టిల్లర్‌కు రూ.60వేలు ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వ్యవసాయధికారులను సంప్రదించాలని సూచించారు.

### ఎన్నికల హామీల అమలులో

## కూటమి ప్రభుత్వం విఫలం

**డుంబ్రిగుడ:** ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, డుంబ్రిగుడ వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు మోసం చేశారని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచమని ప్రకటించి, ఆరు నెలల్లో రెండుసార్లు చార్జీలను గణనీయంగా పెంచారని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పి, నేటికి ఆరు నెలలు గడుస్తున్నా అమలుచేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏజెన్సీలో గిరిజనుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆరు నెలలు పైబడినా చంద్రబాబు నేటి వరకు ఒక్క పథకాన్ని అమలుచేయలేదని, ఏజెన్సీలో ఒక్క ప్రాంతంలో కూడా అభివృద్ధి పనులు చేసిన దాఖలాలు లేవని ఆయన విమర్శించారు.